క్లుప్తంగా

పరామర్శ



శ్రీనివాసరావును పరామర్శిస్తున్న వేణుగోపాలనాయుడు, తదితరులు

బొబ్బిలి: అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తను నియోజకవర్గ జేసీఎస్ ఇన్‌చార్జి శంబంగి వేణుగోపాలనాయుడు మంగళవారం పరామర్శించారు. జగన్నాథపురం గ్రామానికి చెందిన ఎస్.శ్రీనివాసరావుకు ఆరోగ్యం బాగా లేకపోవడంతో ఆయన్ని కుటుంబ సభ్యులు బొబ్బిలి ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. విషయం తెలుసుకున్న శంబంగి వేణుగోపాలనాయుడు ఆస్పత్రికి వెళ్లి రోగిని పరామర్శించి, మెరుగైన వైద్య సేవలందించాలని వైద్యులను కోరారు. పరామర్శించిన వారిలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి బొద్దల సత్యనారాయణ,తదితరులున్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్...

వంగర: సంగాం గ్రామంలో తాగునీటి పథకానికి సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్ పాడవడంతో కుళాయిల ద్వారా తాగునీటి సరఫరా నిలిచిపోయి మూడురోజుల పాటు గ్రామస్తులుపడిన ఇబ్బందులపై 'సంగాంలో తాగునీటి ఇక్కట్లు' శీర్షికన ఈనెల 23వ తేదీన సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి ఎంపీడీఓ ఎస్.రఘునాథాచారి, విద్యుత్‌శాఖ ఏఈ వేమిరెడ్డి సాంబశివరావు స్పందించారు. పాడైన ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో మంగళవారం కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి తాగునీటి పథకం మోటారుకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించి, సమస్యను పరిష్కరించారు.

బేబీ నాయన పుట్టినరోజు వేడుకలు



బేబీ నాయనకు శుభాకాంక్షలు చెబుతున్న బుడా చైర్మన్ తెంటు, తదితరులు

బొబ్బిలి: పట్టణంలోని కోటలో ఎమ్మెల్యే బేబీ నాయన పుట్టిన రోజు వేడుకలు మంగళ వారం ఘనంగా జరిగాయి. అభిమానుల మధ్య కేకు కట్ చేశారు.బుడా చైర్మన్ తెంటు లక్ష్మునాయుడు, డాక్టర్ కె.వి.అప్పారావు, మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్, సర్పంచ్‌లు,ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

నిరసన బాటలో వార్డు సచివాలయ ఉద్యోగులు



మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడుకు నోటీసులు అందిస్తున్న వార్డు సచివాలయ ఉద్యోగులు

రాజాం: రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని వ్యతిరేకిస్తూ వార్డు సచివాలయ ఉద్యోగులు నిరసనకు దిగుతున్నారు. ఈమేరకు రాజాం మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడుతో పాటు పట్టణ సీఐ అశోక్‌కుమార్‌కు మంగళవారం ముందస్తుగా నోటీసులు అందించారు. ఈనెల 25న అన్ని వార్డు సచివాలయాల వద్ద, ఆయా వార్డులో నిరసన తెలియజేస్తామని తెలిపారు. తమకు సరైన జాబ్ చార్ట్‌లేదని, ప్రమోషన్లు లేవు సరికదా ఉన్న ఉద్యోగాలను రేషనలైజేషన్ ద్వారా కుదించేస్తున్నారని ఆరోపించారు. ముందుగా నిరసన ద్వారా తమ డిమాండ్లు తెలియజేస్తామని, అనంతరం పోరాటం ఉధృత్తం చేస్తామని ఉద్యోగులు తెలిపారు.

సకాలంలో సమస్యలు పరిష్కరించాలి

వంగర: వివిధ సమస్యలపై గ్రామ సచివాలయాల్లో ప్రజలు అందించే అర్జీలకు సకాలంలో పరిష్కారం చూపాలని చీపురుపల్లి డీఎల్‌డీఓ హేమసుందరరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లతో మంగళ వారం సమావేశం నిర్వహించారు. మనమిత్ర ప్రోగ్రాం, వాహన ఆధార్ సీడింగ్, జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీ, ఈ-సర్వీసెస్, ఐవీఆర్ కాల్స్ పరిష్కారం వంటి అంశాలపై పలు సూచనలు చేశారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలన్నారు. ఎంపీడీఓ ఎస్.రఘునాథాచారి, ఈఓపీఆర్డీ కెల్ల రామారావు, తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధి రుణాలకు బ్రేక్..!

- రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వేల మంది నిరుద్యోగులు
- మొదట్లో గొప్పగా ప్రచారం చేసిన కూటమి ప్రభుత్వం
- ఇంటర్వ్యూలు నిర్వహించాక రుణాలు మంజూరు చేయలేక చేతులెత్తేసిన వైనం
- నెలల తరబడి ఎదురు చూపులు చూస్తున్న దరఖాస్తుదారులు



రామభద్రపురంలో స్వయం ఉపాధి రుణాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు (ఫైల్)

రామభద్రపురం: స్వయం ఉపాధి రాయితీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగ యువతకు ప్రభుత్వం మొండిచెయ్యి చూపించేలా ఉంది. నిరుద్యోగ యువత ఏదో ఒక వ్యాపారమో, కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకుని సొంతంగా తమ కాళ్లమీద నిలబడేలా 50 శాతం రాయితీతో రుణాలు ఇస్తామని, ఎన్ని లక్షల రూపాయల కైనా దరఖాస్తు చేసుకోండి ఇచ్చేస్తాం అంటూ టీడీపీ కూటమి ఎమ్మెల్యేలు ఊరూరా ప్రచారం చేసి ఊదర గొట్టా రు. కులాల వారీగా ఆయా కార్పొరేషన్‌లు ద్వారా రుణా లు మంజూరు చేస్తామని ప్రభుత్వం చెప్పింది. ఇందుకు అనుగుణంగా బీసీ, కాపు, రెడ్డి, కమ్మ, వైశ్య, బ్రాహ్మణ, క్షత్రియ,మేదర, కుమ్మరి,శాలివాహన తదితర కార్పొరేషన్ల అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తూ నోటిఫికేషన్లు జారీ చేశాయి. దీంతో వందలాది మంది నిరుద్యోగులు ప్రభుత్వం రుణాలిస్తుందనే ఆశతో దరఖాస్తు చేసుకున్నా రు.ఒక్కో మండలానికి వందలోపు యూనిట్లు కేటాయించడం, ఒక్కో పంచాయతీలో ముగ్గురు లేదా నలుగురుకి మాత్రమే రాయితీ రుణం పొందే అవకాశం ఉండడంతో దరఖాస్తుదారులు కూటమి పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులను ఆశ్రయించి సిఫార్సులు చేయించారు.మండలాలు, మున్సిపాలిటీల వారీగా ఎంపీడీఓ, మున్సిపల్ కమిషనర్ల ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వ హించి అభ్యర్థుల ఎంపిక కూడా పూర్తి చేశారు.ఈజాబితాలను బ్యాంకులకు చేరవేయగా, బ్యాంకు అధికారులు మళ్లీ వీరిలో కొంత మందిని ఎంపిక చేసి ఆజాబితాను కలెక్టర్ అనుమతి కోసం పంపించారు. ఇంకొంత మంది జాబితా కలెక్టర్ వద్దకు పంపాల్సి ఉంది కూడా.ఈతతంగమంతా మార్చి, ఏప్రిల్ నెలల్లో సాగింది. ఇంటర్వ్యూలు అంతా అయ్యాక, తదుపరి ఆదేశాలు వచ్చేవరకు రుణాల ప్రక్రియ నిలిపి వేయాలని ప్రభుత్వం నుంచి జిల్లా ఉన్నతాధికారులకు అనధికారికంగా సందేశాల రూపంలో ఆదేశాలు వచ్చినట్లు సమాచారం.

బొబ్బిలి నియోజకవర్గంలో రుణాల కోసం మండలాల వారీగా అందిన దరఖాస్తులు, ఎంపికైన వారి వివరాలు			
మండలం	దరఖాస్తులు	ఎంపికైన వారు	కలెక్టర్ అనుమతి కోసం పంపిన దరఖాస్తులు
రామభద్రపురం	455	108	29
బొబ్బిలి	390	127	32
బాడంగి	377	70	08
తెర్లాం	706	39	03

1928 దరఖాస్తులు

రుణాల కోసం బొబ్బిలి నియోజకవర్గంలో 1928 మంది దరఖాస్తు చేసుకోగా అధికారులు 344 మందిని ఎంపిక చేసి వారి జాబితాను బ్యాంకులకు పంపించారు. ఎంపికై న వారిలో కొందరు బ్యాంకులకు గ్యారెంటీలు సైతం సమర్పించారు. బ్యాంకు అధికారుల కూడా వారికి నమ్మకం ఉన్న కొంత మంది లబ్ధిదారుల జాబితాను కలెక్టర్ అప్రూవల్ కోసం పంపించారు. ఆ తర్వాత రుణాల మంజూరుకు బ్రేక్ పడడంతో దరఖాస్తుదారులు మండిపడుతున్నారు.

ఇది అబ్రకదబ్ర ప్రభుత్వం..



ఇది అబ్రకదబ్ర ప్రభుత్వం. ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయకుండానే పూర్తిగా అమలు చేసేశామని ముఖ్యమంత్రి చంద్రబాబు అరచేతుల్లో స్వర్గం చూపుతున్నారు. కాదు కూడదని ఎవరైనా ప్రశ్నిస్తే వారి నాలుక మందం అంటున్నారు.స్వయం ఉపాధి రుణాలు వస్తే ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చన్న ఆశతో వేలాది మంది నిరుద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. ఆ రుణాలు మంజూరు చేయకుండా మధ్యలో చేతులెత్తేసి నిరుద్యోగులకు ప్రభుత్వం మొండి చేయి చూపింది. ఇది పక్కాగా నమ్మించి మోసం చేయడమే.

– శంబంగి వెంకట చినఅప్పలనాయుడు, బొబ్బిలి మాజీ ఎమ్మెల్యే

ఎవరిని మోసం చేయడానికి..



స్వయం ఉపాధి రుణాలు మంజూరు చేస్తామని హంగామా చేశారు. దరఖాస్తులు స్వీకరించి, ఇంటర్వ్యూలు చేసి మిన్నకుండిపోయారు. ఈతతంగం అంతా ఎవరిని మోసం చేయడానికి.?. రుణాలు ఇవ్వలేనప్పుడు దరఖాస్తుల స్వీకరించడం, ఇంటర్వ్యూలు చేయడం ఎందుకు.?. నిరుద్యోగులను మోసగిస్తే తగిన గుణపాఠం జరుగుతుంది.

– అలమండ ఆనందరావు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి,రామభద్రపురం

చిత్తశుద్ధి ఉంటే కొనసాగించాలి



ప్రభుత్వానికి ప్రజలంటే అలుసా..?స్వయం ఉపాధి రుణాలొస్తాయనే ఆశతో వందలమంది నిరుద్యోగ యువకులు దరఖాస్తు చేసుకున్నారు. అంతా చేసి రుణాలు ఇవ్వాల్సిన సమయంలో చేతులెత్తేయడం ఏమిటి.?. సర్కారుకు చిత్తశుద్ధి ఉంటే వెంటనే రుణాలు మంజూరు ప్రక్రియను కొనసాగించాలి.

– బలస శ్రీనివాసరావు, సీపీఎం మండల నాయకుడు,రామభద్రపురం

కార్మికులకు అండగా వైఎస్సార్‌సీపీ



మాట్లాడుతున్న తలే రాజేష్

రాజాం: మున్సిపల్ ఇంజినీరింగ్, అవుట్ సోర్సింగ్ కార్మికులకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని ఆ పార్టీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ హామీ ఇచ్చారు. మున్సిపల్ ఇంజినీరింగ్, అవుట్ సోర్సింగ్ కాంట్రాక్ట్ ఉద్యోగుల సమ్మెకు ఆయన మద్దతు ఇచ్చారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద నిరవధిక నిరాహార దీక్షలు చేస్తున్న కార్మికులకు మంగళవారం ఆయన సంఘీభావం తెలిపారు. ఈసందర్భం గా మాట్లాడుతూ బూటకపు హామీలతో ప్రజలను మోసగించినట్టే కార్మికులను సైతం చంద్రబాబు మోసగిస్తున్నారని దుయ్యబట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా 48 రోజులుగా కార్మికులు ధర్నాలు చేస్తుంటే ప్రభుత్వం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఫిట్‌మెం ట్ ప్రకటించకుండా, ఉద్యోగులను రెగ్యులర్ చేయకుండా, జీతాలు పెంచకుండా కాలం నెట్టుకొస్తోందని, కార్మికుల పిల్లలకు తల్లికి వందనం వంటి పథకాలను కూడా వర్తింపచేయక పోవడం సరికాదన్నారు.గతంలో అడగకుండానే మున్సిపల్ కార్మిక, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు జగన్‌మోహన్‌రెడ్డి రూ.3వేల జీతాన్ని పెంచారని గుర్తు చేశారు. మున్సిపాలిటీలోని టెక్నికల్ ఉద్యోగులకు నెలకు రూ. 29,200, నాన్ టెక్నికల్ ఉద్యోగులకు రూ. 24,500 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు.తాము అధికారంలోకి వచ్చిన వెంటనే కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.కార్మిక సంఘ ఐక్యవేదిక జిల్లా కార్యదర్శి సీహెచ్. రామ్మూర్తి నాయుడు, మున్సిపల్ ఇంజినీరింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగ సంఘాల నాయకులు మజ్జి ఈశ్వరరావు, టెంటు రవి, పి.లక్ష్మణ రావు, సిద్దా మురళి, హరికృష్ణ, అనిల్‌కుమార్, కృష్ణ, గణపతి, మోహ న్, రామకృష్ణ, మరియదాసు, ప్రసన్న, శారద, లక్ష్మి, మహేష్, సత్యనారాయణ, సోమేష్, రాజాం పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ పెన్షనర్స్ సెల్ కన్వీనర్ పాలవలస శ్యామ్, అధికార ప్రతినిధి ఆసపు సూర్యం, కోరాడ రాము నాయు డు, సలాది జగదీష్, కార్యదర్శి శాసపు వేణుగోపాలనాయుడు, జిల్లా కల్చరల్ వింగ్ అధ్యక్షుడు డాక్టర్ బి.నరేంద్ర పాల్గొన్నారు.

భూరికార్డుల్లో తప్పులను సరిచేయండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దళిత రైతులు, మహిళలు

వంగర: తమ భూములకు సంబంధించిన రికార్డులు తప్పులతడకగా ఉన్నాయని, వెంటనే వాటిని సరిచేయాలని మండల కేంద్రానికి చెందిన 55 మంది దళిత రైతులు, మహిళలు తహసీల్దార్ హరిరమణారావును కోరారు. మాజీ సర్పంచ్ గొటివాడ చిన్నమ్మడు, గొండేల తవిటయ్య మాస్టారు ఆధ్వర్యంలో రైతులు, మహిళలు తహసీల్దార్‌ను మంగళ వారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు ప్రభుత్వం గతం లో డీపట్టా భూములు ఇచ్చిందని, ఆ ఖాతా సంఖ్యలతో తమకున్న భూమి కంటే ఆన్‌లైన్‌లో ఎక్కువ చూపిస్తోందని తహసీల్దార్ దృష్టికి తీసుకువచ్చారు. కొంతమందికి పది ఎకరాలు, మరికొంత మందికి ఇరవై ఎకరా లు ఉన్నట్లు ఆన్‌లైన్‌లో నమోదయ్యాయని, దీని వల్ల సంక్షేమ పథకాలను కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఆన్‌లైన్‌లో భూరికార్డులను సరిచేసి, న్యాయం చేయాలని కోరారు.

మెనూ పక్కాగా పాటించాలి



రాజాం: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన వంటకాలను పరిశీలిస్తున్న ఎంఈఓ దుర్గారావు



వంగర: కేజీబీవీలో మధ్యాహ్న భోజన వంటలను పరిశీలిస్తున్న తహసీల్దార్ హరిరమణారావు

రాజాం: మధ్యాహ్న భోజన పథకంలో పక్కాగా మెనూ పాటించాలని, విద్యార్థులకు నాణ్యమైన రుచి, శుచికరమైన భోజనం అందించాలని ఎంఈఓ యాగాటి దుర్గారావు వంట నిర్వాహకులకు సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన వంటలను మంగళవారం ఆయన పరిశీలించారు. విద్యార్థుల హాజరుశాతం, భోజనం చేస్తున్న వారి సంఖ్యను సరి చూశారు. ఆయన వెంట ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ షణ్ముఖరావు, అధ్యాపకులు ఉన్నారు.

నాణ్యతలో రాజీ పడొద్దు

వంగర: స్థానిక కస్తుర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని(కేజీబీవీ) తహసీల్దార్ హరిరమణారావు మంగళవారం సందర్శించారు. పాఠశాలలో సదుపాయాలు, విద్యార్థినులకు అందిస్తున్న భోజనాలను పరిశీలించారు. వంటకాలను రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థినులకు అందించే భోజనాల నాణ్యతలో రాజీ పడొద్దని కేజీబీవీ ఎస్ఓ బి.రోహిణికి సూచించారు. విద్యార్థినుల ఆరోగ్యంపై శ్రద్ధపెట్టాలని చెప్పారు.

ఎంఐజీ ప్లాట్లకు లాటరీ

బొబ్బిలి: బొబ్బిలి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలో సాలూరు హైవే పక్కన ఉన్న రెండు ఎంఐజీ లేఅవుట్లలో మౌలిక సదుపాయాల కల్పన కోసం రూ.9 కోట్లతో టెండర్లు ఖరారు చేసినట్టు బుడా చైర్మన్ తెంటు లక్ష్మునాయుడు తెలిపారు. సాలూరులోని బుడా ఎంఐజీలో ప్లాట్లకు స్థానిక బుడా కార్యాలయంలో మంగళవారం లాటరీ తీసి 17 మంది లబ్ధిదారులకు ప్లాట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుడా పరిధిలో త్వరలోనే ప్రైవేటు స్థలాలు కొనుగోలు చేసి ప్లాట్లు వేసి మధ్యతరగతి ప్రజలకు అందజేస్తామన్నారు. పార్వతీపురంలో ఉన్న స్థలం ప్లాట్ల నిర్మాణానికి అనువుగా లేదన్నారు. బొబ్బిలి, పార్వతీపురంలో త్వరలో కొత్తగా స్థలాలు సేకరిస్తామన్నారు. ఇందు కోసం కొన్నిప్రాంతాలను గుర్తించామన్నారు. అనధికార లేఅవుట్లను గుర్తించి రద్దు చేస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పంచాయతీ కార్యదర్శులు ఇక నుంచి బుడా పరిధిలోని సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేసి అనుమతులివ్వాలన్నారు. ఇందు కోసం బుడాకు, పంచాయతీకి కూడా ఫీజు చెల్లించాలన్నారు. సెక్రటరీ దేవకుమార్ పాల్గొన్నారు.

లోగో విడుదల

బుడాకు సంబంధించిన లోగోనుమంగళవారం విడుదల చేశారు. ఎమ్మెల్యే బేబీ నాయన చేతుల మీదుగా కోటలో జరిగిన ఈ కార్యక్రమంలో చైర్మన్ తెంటు లక్ష్మునాయుడు, బుడా సిబ్బంది పాల్గొన్నారు.

మత్తు పదార్థాలు వద్దు.. ఆరోగ్యమే ముద్దు



బొబ్బిలి: అవగాహన కల్పిస్తున్న సీఐ చిన్నంనాయుడు

బొబ్బిలి: విద్యార్థులు, యువత మత్తు పదార్థాలు, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని ఎక్సైజ్ సీఐ పి.చిన్నంనాయుడు సూచించారు. 'మత్తు పదార్థాలు వద్దు.. ఆరోగ్యమే ముద్దు' పేరిట మత్తుపదార్థాల వినియోగంతో కలిగే అనర్థాలపై పట్టణంలోని రాజా కాలేజ్‌లో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సీఐ చిన్నంనాయుడు మాట్లాడుతూ డ్రగ్స్‌కు బానిసగా మారితే మీతో పాటు సమాజానికి కూడా భారం, భారీ నష్టం జరుగుతుందన్నారు. మత్తుపదార్థాలకు అలవాటుపడి ఆరోగ్యాన్ని, భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని సూచించారు. ఎస్ఐ బి.రాముడు, ప్రిన్సిపాల్ వీరేంద్రకుమార్, పీడీ ప్రభాకర్,అధ్యాపకులు శరత్, తదితరులు పాల్గొన్నారు.

మత్తుతో జీవితాలు చిత్తు

రాజాం సిటీ: మత్తుపదార్థాల జోలికిపోయి జీవితాలను చిత్తు చేసుకోవద్దని,చదువుపై దృష్టిసారించాలని ఎక్సైజ్ సీఐ ఆర్.జైభీమ్ విద్యార్థులకు సూచిం చారు. మత్తుపదార్థాల వినియోగంతో కలిగే అనర్థాలపై పట్టణంలోని ఓప్రైవేటు కళాశాలలో విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఎక్సైజ్ ఎస్ఐ జి.మాన్యాలు, కళాశాల ప్రిన్సిపాల్ సాయిరాం, తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల ధర్నా



ధర్నా చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

బొబ్బిలి: పట్టణంలో వార్డులు, వీధులు పెరిగినందున ఉండాల్సిన వారి కన్నా చాలా తక్కువ మంది పారిశుద్ధ్య కార్మికులున్నారని, వారి సంఖ్య పెంచాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పొట్నూరు శంకరరావు డిమాండ్ చేశారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదురుగా పారిశుద్ధ్య కార్మికులు మంగళవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చనిపోయిన, రిటైర్ అయిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులను నియమించాలన్నారు. వారి పీఎఫ్, ఈఎస్ఐ సెటిల్‌మెంట్లను త్వరితగతిన జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే తల్లికి వందనం పథకాన్ని పారిశుద్ధ్య కార్మికులకు వర్తింపజేయాలన్నారు. కార్మికుల యూనియన్ అధ్యక్షుడు జి.గౌరి, యుగంధర్, కార్మికుల సాంబ, శంకరరావు, వెంకటి, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

సంతకవిటి: బొద్దూరు గ్రామంలోని మద్దువలన కాలువలో చేపడుతున్న ఉపాధి హామీ పనులను ఏపీఓ హరనాథరావు మంగళవారం పరిశీలించారు. వేతనదా రులకు ఆయన పలు సూచనలు చేశారు. ఉపాధి సిబ్బంది ఇచ్చిన కొలతల ప్రకారం రోజూ రెండు పూటలా పనులు చేస్తే గరిష్ఠంగా రూ.307 వేతనం లభిస్తుందని తెలిపారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపిక



బాడంగి: బాడంగి హైస్కూల్ విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం, సిబ్బంది



తెర్లాం: పెరుమాళి మోడల్ స్కూల్ విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈఓ త్రినాథరావు, ప్రిన్సిపాల్ జ్యోతిలక్ష్మి

రాజాం సిటీ: మండలంలోని పొగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుకుని ఉత్తమ ఫలితాలు సాధించిన ఐదుగురు విద్యార్థులకు ట్రిపుల్ ఐటీలో సీట్లు వచ్చాయని హెచ్ ఎం పద్మావతి మంగళవారం తెలిపారు. లావేటి లక్ష్మణరావు, గోక కుమారరాజు (నూజివీడు క్యాంపస్‌కు), లోలుగు హిమబిందు (ఒంగోలు), జడ్డు ద్రాక్షా యని (ఇడుపులపాయ), ఒంపూరు జగదీష్ (శ్రీకాకుళం) ఎంపికయ్యారని చెప్పారు.

బాడంగి మండలం నుంచి ఐదుగురికి..

బాడంగి: స్థానిక ఉన్నత, గురుకుల పాఠశాల నుంచి ఐదుగురు విద్యార్థులకు ట్రిపుల్ ఐటీలో సీట్లు వచ్చాయని హెచ్‌ఎం. సత్యనారాయణ,ప్రిన్సిపాల్ వరప్రసాదరావు తెలిపారు. ఉన్నత పాఠశా లకు చెందిన విద్యార్థులు గొట్టాపు మణికంఠ,తెంటు హరిప్రియ, కానూరి తులసి,రౌతు కిరణ్, గురుకులానికి చెందిన నడగాన వరుణ్‌కుమార్ వివిధ క్యాంపస్‌లకు ఎంపికయ్యారు.

పెరుమాళి మోడల్ స్కూల్ నుంచి ఆరుగురు..

తెర్లాం: ట్రిపుల్ ఐటీకి మండలంలోని పెరుమాళి మోడల్ స్కూల్ నుంచి ఆరుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. వి.నిహారిక(నూజివీడు క్యాంపస్), బి.గుణప్రియ, డి.కీర్తన, యు.నిఖిల్, వి.కార్తీక్ (శ్రీకాకుళం క్యాంపస్), కె.గణేష్ ఇడుపులపాయ క్యాంపస్‌లో సీట్లు సాధించారని ప్రిన్సిపాల్ జ్యోతిలక్ష్మి తెలిపారు. అలాగే నందబలగ హైస్కూల్ విద్యార్థి ఈదుబిల్లి కార్తీక్ శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో సీటు సాధించాడు. విద్యార్థులను ఎంఈఓ జె.త్రినాథరావు, అభినందించారు.

సొంత మండలాల్లో పని చేసుకునే అవకాశం కల్పించాలి



రామభద్రపురం: నిరసన తెలుపుతున్న సచివాలయ ఉద్యోగులు

తమకు సొంత మండలాల్లోనే పనిచేసుకునే వెసులుబాటు కల్పించాలని సంతకవిటి, రామభద్రపు రం మండలాల గ్రామ సచివాలయ ఉద్యోగులు కో రారు. ఆయా మండల పరిషత్ కార్యాలయాల వద్ద మంగళవారం నిరసన తెలిపారు. అనంతరం ఎంపీడీఓలు కె.సురేష్‌కుమార్, రత్నంకు వినతిపత్రాలు అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వెబ్ కౌన్సిలింగ్ ద్వారా మాత్రమే బదిలీలు చేపట్టాలని, సమస్యల పరిష్కా రానికి ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని, చేయాలని కోరారు. వంగరలో పీహెచ్‌సీ వైద్యాధికారి కలమట ఈశ్వరరావుకు సచి వాలయ వైద్యసిబ్బంది వినతిపత్రం అందజేశారు.

– సంతకవిటి/ రామభద్రపురం/ వంగర



సంతకవిటి: ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు



వంగర: వైద్యాధికారి ఈశ్వరరావుకు వినతిపత్రం అందజేస్తున్న సచివాలయ వైద్యసిబ్బంది

సంక్షిప్తంగా..

జూలై 4న గంటి ప్రసాదం వర్ధంతి

బొబ్బిలి: వచ్చే నెల 4న మహారాణిపేటలోని కామ్రేడ్ గంటి ప్రసాదం స్మారక భవనంలో గంటి ప్రసాదం 12వ వర్ధంతిని నిర్వహించనున్నట్టు ప్రగతిశీల కార్మిక సమాఖ్య జిల్లా అధ్యక్షుడు తమటాల అప్పలనా యుడు తెలిపారు. సంబంధిత కరపత్రాలను మంగళవారం ఆవిష్కరించారు. ఇప్టూ రాష్ట్ర నాయకులు పి.ప్రసాద్, పి.కె.ఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నపూర్ణ, కొండా రెడ్డి తదితరులు హాజరయ్యే ఈ కార్యక్రమానికి తరలిరావాలని కోరారు. పీకేఎస్ జిల్లా కార్యదర్శి రాయితి సత్యం, దాసరి వెంకటరమణ,పిల్లా లక్ష్మణరావు,ప్రజాకళామండలి రాష్ట్ర నాయకులు తూముల సింహాచలం,బొత్స కన్నంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సభ

బాడంగి: గిరిజనులకు ప్రధానమంత్రి ధర్తి అభ జన జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్ పథకాలు వరిస్తున్నదీలేనిదీ తెలుసుకునేందుకు మండలంలోని గదబవలసలో ఆ గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో మంగళ వారం గ్రామసభ నిర్వహించారు.ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ గ్రామస్తుల సమస్యలు తెలుసుకున్నారు. తమకు రేషన్ కార్డు లేదని ఓ కుటుంబ సభ్యులు ఎంపీడీఓ దృష్టికి తీసుకు రాగా...వారం రోజుల్లో ఆ కుటుంబానికి రేషన్‌కార్డు మంజూరు వేయాలని వీఆర్‌ఓను ఆదేశించారు. గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించేందుకు వాటర్ ట్యాంకు నిర్మిస్తామని ఎంపీడీఓ చెప్పారు. సీసీ రోడ్లు, కాలువల నిర్మాణానికి అంచనాలు తయారు చేయాలని ఇంజినీరింగ్ శాఖ సిబ్బందిని ఆదేశించారు. ఎంపీటీసీ సభ్యురాలు యజ్జల లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



బదిలీ అయిన టీచర్లతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

రేగిడి: తాటిపాడు ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేసి బదిలీ అయిన ఉపాధ్యా యులను స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ కృష్ణారావు మాస్టారు ఆధ్వర్యంలో మంగళ వారం ఘనంగా సన్మానించారు. బదిలీ అయిన ఉపాధ్యాయుల్లో గార రాంబాబు, గౌరునాయుడు, మల్లికార్జునస్వామి, మెహతాలాల్, రాము, తదితరులున్నారు. గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో తనిఖీలు

రాజాం సిటీ: మండలంలోని కంచరాం, ఆగూరు గ్రామ సచివాలయాల్లో ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు మంగళవారం తనిఖీలు చేశారు. సిబ్బంది హాజరు, తదితర రికార్డులు పరిశీలించారు. సమయపాలన పాటించాలని, ప్రజలకు అందుబాటులో ఉండాలని, పెండింగ్ సర్వేలను త్వరితగతిన పూర్తిచేయాలని సిబ్బందికి సూచించారు. విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే కంచరాంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించి, అక్కడి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎంపీడీఓ వెంట కంచరాం సర్పంచ్ గెద్దాపు అప్పలనాయుడు, తదితరులున్నారు.

ఆత్మస్థైర్యాన్ని పెంచాలి

రేగిడి: ప్రత్యేక అవసరాల పిల్లల్లో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించాలని ఎంఈఓలు ఎం.వి.ప్రసాదరావు, బి.ఎరకయ్య తల్లిదండ్రులకు సూచించారు. స్థానిక భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాల విద్యార్థుల తల్లిదండ్రులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఇంటి వద్ద సాయంత్రం పూట తల్లిదండ్రులు దగ్గరుండి పిల్లలను చదివించాలని, సెల్‌ఫోన్‌లు వాడకుండా చూడాలని ఎంఈఓలు సూచించారు.ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ కెంబూరు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ



విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న దాతలు

రాజాం సిటీ: పొనుగుటివలస గ్రామ ప్రాథమిక పాఠశాలలోని 41 మంది విద్యార్థులకు అదే గ్రామాని కి చెందిన శివరామాంజనేయ యువజన సంఘం సభ్యులు మంగళవారం నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. యువకులు రెడ్డి శ్రీనివాసరావు, గాడెపల్లి గోవిందరావు, హెచ్‌ఎం విజయకుమారి, ఉపాధ్యా యులు నూకరాజు, ఎస్.సయ్యద్‌సమీర్, పాపారావు పాల్గొన్నారు.